సభలో మాట్లాడుతున్న రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగా నాగార్జున

భత్యం లేకుండా బతికేదెలా..?

- క్లాప్ డ్రైవర్ల మొర వినే వారే లేరా..? - విధి లేని పరిస్థితిలో క్లాప్ ఆటోలు బంద్
- 6 నెలల నుంచి సంవత్సరం వరకు వేతనాలు లేవు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక, ఉపాధి లేక డ్రైవర్ లైసెన్సులు పొందిన నిరుద్యోగులు ప్రభుత్వము ఏర్పాటు చేసిన ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే క్లాప్ ఆటో డ్రైవర్ల పోస్టులు పడటంతో ఉద్యోగాల్లో చేరారు. ఈ పని చేసేందుకు రెడ్డి ఏజెన్సీ ముందుకు రావడంతో రెడ్డి ఏజెన్సీ ద్వారా ఉత్తర్వులు తీసుకొని కర్నూల్ నగరంలో 98 మంది అదనంగా 6 మంది స్పేర్‌లో పనిచేసేందుకు క్లాప్ ఆటో డ్రైవర్లుగా విధుల్లో చేరారు. విధుల్లో చేరిన క్లాప్ ఆటో డ్రైవర్ల ఆశలు అడియాశలు అయ్యాయి. కనీసం మూడు నెలలకు ఒకసారి అయినా తమకు ఇస్తామన్న రూ.18,500 వేతనం ఇవ్వకపోగా కేవలం రూ.10,118 మాత్రమే ఇస్తూ పిఎఫ్, ఈఎస్ఐ జమ చేస్తామని వారి వేతనాలు నుండి కట్ చేశారు. కానీ ఇంత వరకు సక్రమంగా పీఎఫ్ కట్ చేయకపోగా జీతాలు కూడా ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ఇస్తూ వచ్చారు. మొదట వీరు 2022 ఫిబ్రవరి 7వ తేదీన కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగంలో చేరారు. మొదట రూ.9,270 ఇచ్చారు. జూన్ 2022 నుండి రూ.10,118 చొప్పున నాలుగు నెలలు ఇచ్చారు. పి.ఎఫ్, ఈఎస్ఐ కూడా సక్రమంగా జమ చేయడం లేదు. ఇలా ఇస్తూ ఉండగా ఎలా బతకాలంటూ కొంత కాలం ఆటోలను సిఐటియు ఆధ్వర్యంలో బంద్ చేసి నిరసనలు తెలియజేసిన సందర్భంలో కమిషనర్ జోక్యం చేసుకొని ఇక నుండి జీతాలు సక్రమంగా ఇచ్చేటట్లు చూస్తానని చెప్పడంతో మళ్లీ విధుల్లో చేరారు. అయితే మళ్లీ రెండు నెలలు పూర్తి అయిన వారికి ఇస్తామన్న వేతనాలు ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో మళ్లీ ఆటోలను బందు చేశారు. ఈ విషయము స్వచ్ఛ సర్వేక్షన్ ఎండి కర్నూలు వచ్చిన సందర్భంలో ఆయన దృష్టికి తీసుకు వెళ్లినా, కమిషనర్ దృష్టికి తీసుకువెళినా ఎలాంటి ఫలితం లేకపోగా కమిషనర్ తన చేతిలో ఏమీ లేదు రెడ్డి ఏజెన్సీ సంబంధించి వ్యక్తి మీకు జీతాలు ఇవ్వాలని చేతులెత్తేశారు. దిక్కుతోచని స్థితిలో క్లాప్ డ్రైవర్లు ఉన్నారు. కర్నూల్ నగరం శుభ్రంగా ఉండి స్వచ్ఛ సర్వేక్షన్ లో మొదటి ర్యాంకు సాధించాలంటే క్లాప్ డ్రైవర్ల పాత్ర ముఖ్యమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆలోచన చేసి రెడ్డి ఏజెన్సీతో మాట్లాడి వారికి సక్రమంగా జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి లేకపోతే ఆ ఏజెన్సీని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకున్నప్పుడే కర్నూలు నగరం సుందరంగా స్వచ్ఛంగా ఉంటుంది.

అప్పులు కట్టలేకున్నాం

- ఎస్.రాజేష్, క్లాప్ ఆటో డ్రైవర్

నెల నెల 18,500 రూపాయల జీతం వస్తే ప్రతి నెల వడ్డీ అసలు కట్టుకుంటూ పోవచ్చు అనే ఉద్దేశంతో లక్ష రూపాయలు వడ్డీకి తెచ్చి కట్టాం. జీతం రాకపోవడంతో అప్పులు ఎలా కట్టాలి కుటుంబం ఎలా గడపాలో తెలియక అయోమయంలో పడ్డాం. విధి లేని పరిస్థితిలో కొందరు గౌండ పనికి, ఆటోలు నడపటానికి, క్యాటరింగ్ పనులకు కూలికి వెళుతున్నాం. ఉన్నతాధికారులు మా వైపుగా ఆలోచించి స్పందించి జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని ఆదుకోవాలి.

మాగోడు వినే వారే లేరు

- ఎం అశోక్ వర్ధన్, క్లాప్ ఆటో డ్రైవర్.

జీతాల విషయం ఎవరికి చెప్పినా మా గోడు ఎవరో వినేవారు లేరు. మా పరిస్థితి లేబర్ ఆఫీసర్‌కు చెప్పినా చాలా రకాలుగా అధికారులతో చర్చలు జరిపినా, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిన తమ సమస్య పరిష్కరించడం లేదు. స్వచ్ఛ సర్వేక్షన్ ఎండి దృష్టికి తీసుకువెళ్లి కమిషనర్‌కు చెప్పిన తానేమి చేయలేనని మీరు రెడ్డి ఏజెన్సీ ద్వారానే జీతాలు తీసుకోవాలని తెగేసి చెప్పేశాడు. ఒకటి రెండు నెలలు అయితే ఎవరైనా అప్పులు ఇస్తారు..బదులు తెచ్చుకొని తిని బతుకు వచ్చు కానీ ఆరు నుండి సంవత్సరం వరకు జీతాలు పెండింగ్ పెడితే ఎలా బతకాలి ఏం చేయాలి తోచని పరిస్థితిలో ఉన్నాం.

బాబు పాలనలో స్కామ్‌లు తప్ప.. స్కీమ్‌లు ఉండవు

- మంత్రి మేరుగా నాగార్జున

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడకు అధికారం అప్పగిస్తే స్కామ్‌లు తప్ప.. స్కీమ్‌లు లేవని, ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగించారని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగా నాగార్జున ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర బీసీ సామాజిక సాధికారిక యాత్ర సభ జరిగింది. ముందుగా సోమప్ప సర్కిల్ నుంచి ప్రధాన కూడలిలో యాత్ర నిర్వహించారు. అనంతరం సభలో మంత్రి మేరుగా నాగార్జున మాట్లాడారు. చంద్ర బాబు జిత్తుల మారి నక్క, గజ దొంగ అని, సమస్యలను తప్పించుకొని హామీలను మరిచారని తెలిపారు. సామాజిక సాధికారిత ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని చెప్పారు. పూలే, ఆజాద్, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ ఆశయాలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక పేద, బడుగు వర్గాలు ధైర్యంగా జీవిస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు ఇంటి పట్టాల కోసం కమ్యూనిస్టులు ఆందోళనలు చేసే వారని, కానీ వారు అడగకుండానే 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. గతంలో పవన్ కల్యాణ్ చంద్రబాబును తీవ్రంగా విమర్శించారని, ఇప్పుడు మంచివారంటూ పవన్ చెప్పడం సిగ్గు చేటన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడని, ఆయనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ... చంద్రబాబు వస్తే వర్షాలు రావని, కరువు వస్తుందని తెలిపారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, గురుమూర్తి, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసిపి నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుబోష్ చంద్రబోస్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, బుట్టా రంగయ్య, సునీల్ కుమార్, రియాజ్, మురళీ పాల్గొన్నారు.

31 నాటికి ఫైనల్ ఆర్ఒఆర్ ప్రకటన : జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 31 నాటికి ఫైనల్ ఆర్‌ఒఆర్ ప్రకటన చేయాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల, డివిజన్ స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ఇంకా కొన్ని చోట్ల గ్రౌండ్స్ గుర్తించాల్సి ఉందని, టీమ్‌లు ఏర్పాటు చేయడంలో కూడా పురోగతి కనపర్చడం లేదని, పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ నెల 24న కర్నూలులో యోగ, మారథాన్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోమని మున్సిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సిఇఒను ఆదేశించామని, అదే విధంగా నియోజకవర్గాల వారీగా కూడా 24 లోపు ఏదైనా ఒక తేదీని ఎన్నుకొని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి 160 గ్రామాలలో గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు పూర్తయినప్పటికీ తన లాగిన్‌కు పంపకుండా కొంతమంది తహశీల్దార్ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మధుసూధన రావు, రీ సర్వే అధికారులు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం

11వ రోజు మానవహారం -రాస్తారోకో

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు, ఎఐటియుసి, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మె 11వ రోజుకు చేరుకుంది. కర్నూలులో శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం సర్కిల్‌లో అరగంట పాటు రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై మానవహారం నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. అనంతరం దీక్షా శిబిరం వద్ద ఎఐటిసి, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎస్.మహ్మద్‌రఫీ ,ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్. మనెప్ప , సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎ.నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర,ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరత్నమ్మ, జిల్లా అధ్యక్షులు రంగన్న, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఉశేన్ బాషా, డప్పు కళాకారుల సంఘం నగర కార్యదర్శి మహేష్, రామచంద్ర ,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఖాజా పాషా, రజక సంఘం నగర కార్యదర్శి శేషాద్రి సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ రామాంజనేయులు, సిఐటియు నగర నాయకులు కె.సుధాకరప్ప, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. గత 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదన్నారు. ప్రభుత్వం మంత్రుల ద్వారా చర్చలు జరిపి అసలు జీతాలు పెంచే విషయం మాట్లాడకుండా చిన్న చిన్న కోరికలు తీర్చుతామని, జీతాలకు సమయం ఇవ్వాలని కోరడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. సమ్మె చేస్తున్నది జీతాల కోసం తప్ప వేరే విషయం కాదన్నారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వానికి జీతాలు పెంచాలని కోరుతున్నామని, జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలని లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ నాయకురాలు బాలదుర్గమ్మ ,టిఎస్ విజయ, నాగమణి, లలిత, సునీతభాయి ,నజీమా, ఫర్జానా ,వెంకటేశ్వరమ్మ , పెద్ద ఎత్తున అంగన్వాడీలు హాజరయ్యారు.

కర్నూలు నగరంలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు ప్రమాదం: ధర్నా చౌదరి దగ్గర అంగన్వాడీలు మానవారం చేసే క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా మోటార్ సైకిల్ వాహనదారుడు వచ్చే గుద్దడంతో అంగన్వాడీలకు గాయాలయ్యాయి. లక్ష్మీ కళావతమ్మకు చేయి విరిగిందిని, చౌడేశ్వరి , పద్మావతములకు గాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

అంగన్వాడీల వంటావార్పు- టిడిపి,జనసేన మద్దతు

గూడూరు: అంగన్వాడీల సమ్మెలో భాగంగా గూడూరులో అంగన్వాడీలు వంట, వార్పు, కార్యక్రమం నిర్వమించారు. సమ్మె శిబిరంలోనే సిఐటియు నాయకులతో కలిసి భోజనాలు చేశారు. సిఐటియు కార్యాలయం ఎదురుగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరానికి టిడిపి, జనసేన, పార్టీలు మద్దతు తెలిపాయి. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, ఇందుమతి, మద్దమ్మ ,సిఐటియు జిల్లా నాయకులు జె. మోహన్, మండల అధ్యక్షుడు గుంటప్ప, మండల నాయకులు కె. రాజశేఖర్ పాల్గొన్నారు. టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. టిడిపి మండల కన్వీనర్ నాగాలాపురం సర్పంచి సురేష్, మాజీ వైస్ ఛైర్మన్ రామాంజనేయులు, పసుపల దస్తగిరి, తాండ్రపాడు సర్పంచి జయన్న, జనసేన పార్టీ కోడుమూరు నియోజకవర్గం కోఆర్డినేటర్ ఆకేపోగురాంబాబు, వెంకట్‌రాముడు, రమణమ్మ, జిందేరాములు మాట్లాడారు.

గూడూరులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఉరితాలతో నిరసన..

పత్తికొండ : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, సిఐటియు నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, కాశి, గోపాల్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సురేంద్ర అన్నారు. పత్తికొండలో అంబేద్కర్ సర్కిల్ దగ్గర అంగన్వాడీలు మెడకు ఉరితాడు బిగించుకొని నిరసన తెలిపారు. ప్రాజెక్టుకార్యదర్శి పద్మజ, కాంతమ్మ, ఆశీర్వాదమ్మ, అంజనమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలను తాళాలు పగులగొట్టిన అధికారులు

పత్తికొండలో నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

అడ్డుకున్న డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో సిడిపిఒ, ఎంపిడిఒ, ఎంఇఒ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు అంగన్వాడి కేంద్రాల తాళాలను పగలగొట్టి బలవంతంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తే వారిని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్, నాయకులు హుస్సేన్‌బాష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మండల కార్యదర్శి అంజి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ నాయకులు తిరిగి తాళాలు వేయించారు. అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ తోనే నిర్వహించాలని అలాకాకుండా బలవంతంగా బద్దలు కొట్టి సచివాలయ ఉద్యోగులతో నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. నిజంగా చిన్న పిల్లల పైన గర్భిణీ స్త్రీల పైన ప్రభుత్వానికి కానీ అధికారులకు కానీ ప్రేమ ఉంటే తక్షణమే వారి సమస్యలు పరిష్కరించి సమ్మె విరవింపజేసి అంగన్వాడీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా పేరుకు సెంటర్లు తెరిస్తే చిన్నపిల్లలకు కానీ, గర్భిణీ స్త్రీలకు కానీ ఒరిగేది ఏమీ లేదని తెలిపారు. రక్తహీనతతో పౌష్టికాహారంతో ఇబ్బంది పడుతున్నారని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడి కేంద్రాల నిర్వహిస్తే తాళాలు మాత్రమే పగలగొట్టించగలుగుతారు తప్ప వారికి అన్నం వండి పెట్టలేదన్నారు. పిల్లలకు అన్నం తినిపించలేరని, పిల్లల ముద్ది కడగలేరని తెలిపారు. దమ్ముంటే అధికారులతో లేదా అధికార పార్టీ నాయకులతో చిన్నపిల్లల ముడ్డి కడిగించాలని చాలెంజ్ వేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య

'రవీంద్ర టాలెంట్'లో గణిత దినోత్సవం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని సాయి సుబ్బయ్య రవీంద్ర , రవీంద్ర టాలెంట్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా గణిత దినోత్సవం నిర్వహించారు. ముందుగా సివి రామానుజన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ పిబివీ సుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.వైస్ ప్రిన్సిపల్ శారద,కోఆర్డినేటర్ సౌజన్య, అక్తర్ బేగంతో , గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్ర విద్యాసంస్థలలో గణిత దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక అబ్బాస్ నగర్ లోని రవీంద్ర విద్యాసంస్థలలోని పాఠశాలలో శుక్రవారం రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితనమూనా ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, రవీంద్ర విద్యాసంస్థల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ జె.మమతా మోహన్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మనకు మార్గదర్శిగా నిలిచిన రామానుజన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. నేడు విద్యార్థులు రామానుజన్ , అంబేద్కర్ , డాక్టర్ అబ్దుల్ కలాం లాంటి మేధావులను ఆదర్శంగా తీసుకొని వారి ఉన్నత ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి అడుగుజాడల్లో నడవగలిగినప్పుడే నిజంగా వారికి మనమిచ్చే నివాళి అని తెలిపారు. నిత్యజీవితంలో గణితం ఎంతో మేధస్సును పెంచుతుందని అన్నారు. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. బహుమతులు పొందిన విజేతలను రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జివిఎం. మోహన్ కుమార్ , వైస్ చైర్మన్ జి. వంశీధర్ అభినందించారు.

సిసి రోడ్లు, డ్రైయిన్స్, మంచినీటి పైపులైన్ల నిర్మాణం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

1వవార్డులో 3వ సచివాలయచిదంబరరావువీధిలో శంకర్ నారాయణ భజనమందిరం, పాత ఆంధ్ర బ్యాంక్ సమీపంలలో చిన్న వీధులలో గత 30 యేళ్లుగా ఉన్న పాత సిసిరోడ్లు, డ్రెయిన్స్, మంచినీటి పైప్ లైన్ పూర్తిగా దెబ్బతినడంతో పునర్నిర్మాణం చేపట్టామని ఒకటో వార్డు కార్పొరేటర్ పి.షాషావలి అన్నారు. ప్రజలు ఇబ్బందిని గుర్తించిన గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే, మేయర్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో పనులు చేపట్టామని తెలిపారు.

ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గం

కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షపార్టీల నాయకులు

పార్లమెంటులో పొగ బాంబులతో ప్రవేశించడానికి కారకులెవరో తేల్చండి అని ప్రశ్నించినందుకు పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్యని వామపక్ష నేతలు ఘాటుగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన తీరుకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూల్ కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్ సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్‌ల అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నబి రసూల్, సిపిఎం జిల్లా నాయకులు ఎండి.ఆనంద్ బాబు, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి మాట్లాడారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ఔన్నత్యాన్ని చాటే పార్లమెంటులో పొగ బాంబుతో నిరసన తెలిపిన ఘటనకు సంబంధించి పరిశీలన చేస్తే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ భద్రత డొల్లతనం బయటపడిందన్నారు. తప్పును అంగీకరించి, చేసిన తప్పుకు చంపలేసుకోకుండా.. పార్లమెంటులో భద్రతా వైఫల్యం పై ప్రశ్నించిన ఎంపీలను సస్పెండ్ చేయడం, బిజెపి కుటిల నీతికి నిదర్శనమని అన్నారు. పొగ బాంబు పెట్టిన వ్యక్తులు పార్లమెంటులోకి రావడానికి పాసులు ఇచ్చి ఘటనకు కారణమైన బిజెపి ఎంపీ మాత్రం దర్జాగా పార్లమెంట్లో కూర్చున్నాడని విమర్శించారు. కట్టుదిట్టమైన మూడు అంచల భద్రత వలయాన్ని దాటుకుని పార్లమెంటులోకి అగంతకులు ఎలా వస్తారని ప్రశ్నించిన 191 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం, బిజెపి చేతకానితనానికి నిదర్శనం అన్నారు. తమ దుర్మార్గాలకు అడ్డు రాకూడదనే కుయుక్తితోనే.. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి, తమకు అనుకూలమైన 18 రకాల బిల్లులను ఏకచత్రాధిపత్యంగా ఆమోదించుకున్నారన్నారు. ప్రతిపక్ష ఎంపీలు ఏం కోరారనేది ప్రజలంతా విన్నారని, పార్లమెంటు పై దాడి జరగడాన్ని చర్చించాలనడం ఎలా నేరమవుతుందన్నారు. పశ్చిమబెంగాల్ ఎంపీ పాస్వర్డ్ ఇచ్చిందని పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసిన మోడీ ప్రభుత్వం, పొగ బాంబు వేయడానికి పార్లమెంట్లోకి రావడానికి సంబంధించి పాస్ ఇచ్చిన బిజెపి ఎంపీ చుట్టూ రక్షణ కల్పించారన్నారు. ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, జిల్లా నాయకులు నగేష్, విజయ్ సిపిఐ నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, రామాంజనేయులు, బాబు సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షరీఫ్, రామకృష్ణ, సుధాకరప్ప, సాయిబాబా, నాయకులు వెంకట రాముడు, మహిమూద్, జయమ్మ, ఖాజా పాషా, నాగరాజు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు

సమగ్ర శిక్ష , కెజిబివి ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న 25 మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులు, కెజిబివి వారి సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కర్నూలు ధర్నా చౌక్ నందు నిరవధిక సమ్మె చేశారు. ఇందులో కర్నూలు జెఎసి కమిటీ అద్యక్షులు ఎం.చంద్రశేఖర రాజు, ప్రధాన కార్యదర్శులు రంగన్న, రఫీ,భాస్కర్, కెజిబివి నాయకులు , వారికి మద్దతుగా సిఐటియు నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు, కర్నూలు కార్యదర్శి జె. నాగేశ్వరరావు , సభ్యులు నిరవధిక సమ్మె కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్రలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రెగ్యులరైజేషన్ ఉద్యోగ భద్రత కల్పించి, ఎంటిఎస్ అమలు చేయాలన్నారు. వేతనాలను పెంన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెయిటేజీని కల్పించాలని చెప్పారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మహిళలందరికీ చైల్డ్‌కేర్ లీవ్స్ కల్పించా లన్నారు. విధి నిర్వహణలో మరణించినట్లయితే వారికి రూ.20 లక్షలు చెల్లించాలన్నారు. సామాజిక భద్రత పథకాలు ఇఎస్ఐ, ఇపిఎఫ్, డిఎలు అమలు చేయా లన్నారు. ప్రతినెల ఒకటిని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

సమాజంలో ప్రతి ఒక్క వినియోగదారుడు వినియోగదారుల హక్కులతో పాటు బాధ్యతల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు జాతీయ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముందుగా హాజరైన అధికారులకు, విద్యార్థులకు జాతీయ వినియోగదారుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ వ్యాపారాలలో జరిగే లాభాలను, మోసాలను కూడా విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్లు తప్పని సరిగా తీసుకొని జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. ఏదైనా వస్తువులో లోపం ఉంటే వినియోగదారుల కోర్టు ను ఆశ్రయించి ఫిర్యాదు చేసి న్యాయం పొందాలని సూచించారు. సమాజంలో ప్రతి వినియోగదారుడు తన హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు అందరూ కూడ క్షేత్రస్థాయిలో వినియోగదారులకు వినియోగ హక్కు చట్టం గురించి అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల కేసులకు సంబంధించి వినియోగదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాన్నామన్నారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి కార్యదర్శి శివమోహన రెడ్డి, డిఎస్ఒ ప్రసాద్ మా, సహాయ పౌరసరఫరాల అధికారి ఆచార్యులు, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల , కెవిఆర్ విద్యార్థినులు, పౌరసరఫరాల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

జిల్లాస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-మద్దికేర

మండల కేంద్రమైన మద్దికేర మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు వినియోగదారుల కార్యాచరణ దినోత్సవ సందర్భంగా వ్యాసరచన వక్తృత్య పోటీలలో జిల్లా స్థాయిపోటీలలో ఎంపికయ్యారని శుక్రవారం ప్రిన్సిపల్ సవిత విలేకరులకు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు భవాని సాజిదా బిందు వ్యాసరచన వక్తృత్య పోటీలలో మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలలో ఎంపికయ్యారన్నారు. కలెక్టర్ అభినందించడమే కాకుండా, జాయింట్ కలెక్టర్ మౌర్య చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు నరేంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రూ.3.98 లక్షల అవినీతి

- రికవరికి ఆదేశించిన డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఉపాధి హామీ చట్టంలో రూ.3.98 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో అధికారులు వివరాలను వెల్లడించారు. ఉపాధి హామీ చట్టం కింద 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 820 పనులకు సంబంధించి రూ.76,65,41,186 ఖర్చు చేశారు. ఈ పనులకు సంబంధించి ఈనెల 7 నుండి 21 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో వెల్లడైన విషయాలను ప్రజా వేదికలో గ్రామాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందులో దాదాపు రూ.3,98,185 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించారు. అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశించారు. అడిషనల్ పీడీ మాధవి లత, జిల్లా విజిలెన్స్ అధికారి భాస్కర్, ఆదినారాయణ, ఏపీడీ లోకేష్, ఎంపిడిఒ ప్రభాకర్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పి తిరుమలేష్, పిఆర్ ఎఇ మల్లయ్య, హౌసింగ్ ఎఇ వేణుగోపాల్, ఎపిఒ రామన్న పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

పేదల పక్షపాతి వైసిపి : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలిచిందని మున్సిపల్ చైర్మన్ బోయ శాంతమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, జెసిఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ, కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని 29వ వార్డులో 'ఏపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రజల ఆశీస్సులతో 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. **ఆదోని (రూరల్)** మండలం పెద్దహరివాణం గ్రామ సచివాలయం-1, 2లో 'ఏపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. సర్పంచి రాము, వైస్ సర్పంచి మల్లికార్జున, వైసిపి సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజ్, బి.వీరేష్, హనుమంతప్ప, బజారప్ప, లింగన్న, బలరాం, సంతోష్, నాగరాజ్, సున్ను సాబ్ మాట్లాడారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కరెప్ప, బాలప్ప, మల్లప్ప, మహలింగ, పంచాయతీ ఎంకప్ప పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై డిఎల్‌పిఒ పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

బిఎల్ఒల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను డిఎల్‌పిఒ నాగరాజు నాయుడు పరిశీలించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శశికళ, ఇఒఆర్‌డి ప్రభావతి ఆధ్వర్యంలో ఓటరు నమోదుకు, తప్పొప్పులకు, చిరునామాల బదిలీకి ఉపయోగించిన 6, 7, 8 ఫారాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పెద్దకడబూరు, కౌతాళం మండలాల బిఎల్ఒల ఓటరు నమోదు విధానాన్ని చూశామని, శుక్రవారం కోసిగి, మంత్రాలయం మండలాల బిఎల్ఒల పనితీరును సమీక్షించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే బిఎల్ఒ శివ కృష్ణ నమోదు చేసిన ఫారాలను పరిశీలించినట్లు తెలిపారు. జనవరి 1 నాటికి 18 ఏళ్ళు నిండిన యువత ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప, జిల్లా సహాధ్యక్షులు జీవిత డిమాండ్ చేశారు. గురువారం ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. ఆర్థిక బకాయిలు విడుదలపై డిసెంబర్ 27న మండల, తాలూకా స్థాయిలో, జనవరి 3న జిల్లాస్థాయిలో, 7న రాష్ట్రస్థాయిలో ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ మెంబర్ రామాంజనేయులు, మల్లికార్జున, యుటిఎఫ్ సీనియర్ నాయకులు సునీల్ రాజ్ కుమార్, ఎల్కె బసప్ప, నరసయ్య గౌడ్, పెద్దయ్య, నారాయణ, శివకుమార్ గౌడ్, జహంగీర్, జగన్మోహన్‌రావు, హుస్సేని, విష్ణు, పెద్దయ్య, లింగన్న, రంగనాయకులు, నాగేంద్ర, సుధాకర్, బాలాజీ రావు, రంగన్న, అమీన్, సాదిక్, ఇమ్రాన్, బాబు పాల్గొన్నారు. **కౌతాళం**లో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా కార్యదర్శి గాదిలింగ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు బసప్ప, నారాయణ, సునీల్ రాజ్ కుమార్, బాలాజీ రావు, సుధాకర్, రంగన్న పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

- అంగన్వాడీల ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, ఎఐటియుసి వీరేష్, ఐఎఫ్‌టియు రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 11వ రోజు సమ్మెలో భాగంగా ఎమ్మిగనూరు శివ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. 500 మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధనమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, పింఛను 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీల్లో మార్పు చేయాలని, వర్కర్లకు, హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం సరఫరా చేసే వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో ఉండే వస్తువులు నాణ్యతమైనవి పంపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలిపారు. వంటగ్యాస్, కూరగాయలు, ఇతర అనేక ఖర్చులు జీతం నుంచే పెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వమే వంటగ్యాస్ సరఫరా చేయాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేసి, అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌ను పెట్టాలని కోరారు. టిఎ, డిఎ బిల్లులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరారు. అంగన్వాడీ నాయకులు శైలజ, తులసి, నాగలక్ష్మి, పద్మలత, మేరీ, నిర్మల, గేసమ్మ, సునీత, జయ, జండ లత, గౌసియా, సుమిత్ర, అత్తర్ భాను, పార్వతి, జయమ్మ, రాగమ్మ, శంషాద్ భాను పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సామాజిక సాధికార యాత్రకు వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మంత్రి మేరుగు నాగార్జున, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి, హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి బృందానికి యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, నీరజ, నాగలక్ష్మి, శైలజ, శిరోమణి, వెంకటలక్ష్మి, యుఎఫ్.నాగలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, ఎఐటియుసి మండల కార్యదర్శి తిమ్మగురుడు వినతి పత్రం అందజేశారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, బాలరంగమ్మ, లక్ష్మి, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **కౌతాళం** మండలం ఎరిగేరి గ్రామంలో అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్న జగనన్న ఫుడ్ తీసుకొచ్చిన వాహనాన్ని అంగన్వాడీలు అడ్డుకున్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, అంగన్వాడీ యూనియన్ మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 11 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడిగితే తప్పా అని ప్రశ్నించారు. కాశిలింగ్, లీడ్స్, చాముండి పాల్గొన్నారు. **మంత్రాలయం**లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. సిఐటియు నాయకులు అంజిబాబు, ప్రాజెక్టు అధ్యక్షురాలు భీమేశ్వరి మాట్లాడారు. నాయకులు ప్రమీల, ఫాతిమా, ప్రాజెక్, అంజి, ఆంధ్రయ్య, కెవిపిఎస్ నాయకులు బి.అనిల్ పాల్గొన్నారు. **కోసిగి**లోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు హెచ్చెలరాణి, లూసమ్మ, వరలక్ష్మి మాట్లాడారు. అంగన్వాడీల సమ్మెకు విఆర్ఎల సంఘం మండల నాయకులు రాజు, శాంతరాజు, హనుమంతు, నాగేష్, పురుషోత్తం, తిమ్మప్ప మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు యు.లక్ష్మి, సుజాత, పద్మ, సువర్ణ, దేవి, లక్ష్మి, భాగ్యమ్మ, భాగ్యలక్ష్మి, రాణి పాల్గొన్నారు. **ఆదోని**లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ఆదోని బాబీ అసోసియేషన్ నాయకులు అనితా బాయి, సవిత రాణి, సునీతారెడ్డి, లావణ్య, గిరిధర్ మద్దతు ప్రకటించారు. పట్టణంలోని శ్రీనివాస్ భవనం వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి వారు చేరుకుని మాట్లాడారు. ల్యాండ్ బైట్లెల్లింగ్ చెంత వల్ల కలిగే నష్టాలను వివరించారు. అంగన్వాడీలు చేస్తున్న నిరసన న్యాయబద్ధమని, ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పట్టణ సిఐటియు నాయకులు వీరేష్, గోపాల్, తిప్పన్న, నాయకులు వరలక్ష్మి, పద్మ, జానకి, శారద పాల్గొన్నారు.

ఆలూరులో రాస్తారోకో చేపడుతున్న అంగన్వాడీలు

వక్తృత్వపు పోటీల్లో మోడల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - గోనెగండ్ల

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కర్నూలులో జిల్లాస్థాయి వక్తత్వపు పోటీల్లో గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి కె.అభిలాష్ రెడ్డి ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించారు. శుక్రవారం కర్నూలులోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జెసి నారపురెడ్డి మౌర్య విద్యార్థికి బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లా స్థాయిలో బహుమతి సాధించిన విద్యార్థి అభిలాష్ రెడ్డిని పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్విన్, సిబ్బంది అభినందించారు.

ఆదోనిని జిల్లా చేయాలి

- సబ్ కలెక్టర్‌కు బీసీ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని శుక్రవారం బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడారు. జిల్లా చేయాలని గత మూడేళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని నియోజకవర్గాలను కలుపుకొని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు సాయిబాబా, డివిజన్ సలహాదారులు ధణాపురం శేషన్న, ఆదోని పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, ఆలూరు తాలూకా అధ్యక్షులు బి.తిక్కయ్య, మంత్రాలయం తాలూకా అధ్యక్షులు పి.రఘు రాం, తాలూకా గౌరవ సలహాదారులు దేవిశెట్టి ప్రకాష్, బండారి రాజేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్షావలీ, బి.రాముడు, వీరభద్ర, పట్టణ వైస్ ప్రెసిడెంట్ వడ్డే శ్రీనివాసులు, పట్టణ సలహాదారులు అడ్వకేట్ రామాంజనేయులు, మల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

యువగళం ముగింపు సభతో వైసిపికి ఓటమి భయం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

యువగళం పాదయాత్ర ముగింపు సభతో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని టిడిపి ఇన్‌ఛార్జీ కె.మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఆదోనిలో మాట్లాడారు. ముగింపు సభ వేడుకకు 5 లక్షల మందికిపైగా హాజరై విజయవంతానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణ, లోకేష్‌ను ఒకే వేదికపై చూసిన తర్వాత వైసిపికి ఓటమి భయం పట్టుకుందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పినట్లు 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం టిడిపి, జనసేన పొత్తు చారిత్రాత్మకమవుతుందని తెలిపారు. జగన్ రెడ్డి అక్రమాలకు, అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ముందుకు వస్తే వైసిపి అరాచక ప్రభుత్వం మూడు నెలల్లో కూలి పోతుందని అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జగన్ రెడ్డి అహంకారానికి, ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య జరుగుతున్న యుద్ధమన్నారు. జగన్ రెడ్డి విద్య, వైద్యం, రహదారులతో సహా అన్ని రంగాలను నాశనం చేసి, రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చారని విమర్శించారు. వైసిపి అధికారంలో కొనసాగితే ప్రజలు తమ ఇళ్లల్లో కూడా సురక్షితంగా ఉండలేని స్థాయికి నేరాల రేటు పెరుగిపోతుందని తెలిపారు. టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను అమరావతి, తిరుపతిలో జరిగే రెండు సమావేశాల్లో ఏదో ఒకదాంట్లో ప్రకటిస్తారన్నారు. 2024లో ఆంధ్రప్రదేశ్‌లో మార్పు అత్యవసరమని, ఆ మార్పు కోసమే టిడిపి, జనసేన పొత్తు అని తెలిపారు.

'యువగళం' సభ విజయవంతంతో వైసిపిలో వణుకు

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

యువగళం - నవశకం సభ విజయవంతం కావడంతో వైసిపిలో వణుకు పుట్టిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం టిడిపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపికి గుడ్ బై చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రానున్న రోజుల్లో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, తెలుగు యువత పవన్, లక్ష్మారి బంద్రాల నరసింహులు, జెట్టి వీరేష్, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయి కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు అమర్, ఐ టిడిపి చిదానంద పాల్గొన్నారు.

టిడిపి నాయకునికి తిక్కారెడ్డి పరామర్శ

టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి తండ్రి వీరారెడ్డిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాధవరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వీరారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల హైదరాబాదులో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి శుక్రవారం ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, సరైన సమయానికి మంచి ఆహారం, మందులు తీసుకోవాలని సూచించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు సాయికుమార్ రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జీ జెట్టి వీరేష్ ఉన్నారు.

వీరారెడ్డిని పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

'యువగళం - నవశకం' సభ విజయవంతం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 20న జరిగిన యువగళం - నవశకం సభ విజయంతం చేసినందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ధన్యవాదాలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం-నవశకం సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సభతో వైసిపి నాయకులకు ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అక్రమాలకు, అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు ముందుకొస్తే ఈ తుగ్లక్ పరిపాలన కూలిపోతుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలు జగన్మోహన్ రెడ్డి అహంకారానికి, ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న యుద్ధమని తెలిపారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు రాజు, టిడిపి రాష్ట్ర సెక్రటరీ పోతురాజు రవికుమార్, టిడిపి ఎస్సీ సెల్ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు జేమ్స్, టిడిపి నందవరం మండల నాయకులు గురురాజ్ దేశాయి పాల్గొన్నారు.

బాధితులకు బీవీ పరామర్శ : పట్టణంలోని కోసిగి రోడ్డు, ఎల్లమ్మ బీడులో నివాసం ఉంటున్న నిరుపేద సుశీలమ్మ, రాధమ్మకు చెందిన నివాస గుడిసెలు విద్యుదాఘాతంతో దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బీవీ బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకోవాలని తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తన వంతుగా ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం, బ్యాళ్లు, దుప్పట్లు, చీరలు నిత్యావసర సరుకులతో పాటు రూ.2 వేల ఆర్థికసాయం అందించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

మహా సింహగర్జనను జయప్రదం చేయండి : కురువ సంఘం

ప్రజాశక్తి - హోళగుంద

ఈనెల 24న ఆలూరులో జరిగే మాదాసి, మాదారి కురువ మహా సింహ గర్జనను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శుక్రవారం హోళగుందలో మాదాసి, మాదారి కురువ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసి, మాదారి కురువ సంఘం మండల గౌరవాధ్యక్షులు కాలక ప్రసాద్, సలహాదారుడు శేషప్ప, ఎల్లార్తి సర్పంచి దర్గప్ప, ఎమ్‌డి.హళ్లి సర్పంచి సుధాకర్, మాదాసి కురువ ప్రధాన కార్యదర్శి కురువ మల్లయ్య, మండల అధ్యక్షులు పంపన్న మాట్లాడారు. 24న ఆలూరులో బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మహా సింహ గర్జన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. మండల సహాయ కార్యదర్శి గాది, కోశాధికారి గర్జప్ప, ఎల్లార్తి శేషప్ప, సర్దార్, కమిటీ మెంబర్ సిద్ధప్ప, డాక్టర్ చంద్రశేఖర్, పేటప్ప, పెద్ద సిద్ధప్ప, పెద్ద బీరప్ప, పెద్దహ్యాట అడివప్ప పాల్గొన్నారు. **హాలహర్వి**లో సమావేశం నిర్వహించారు. కురువ సంఘం ఆలూరు తాలూకా కన్వీనర్ కౌడికే నాగరాజ్, ఉపాధ్యక్షులు బసవరాజ్, గౌరవాధ్యక్షులు రంగన్న, ఆలూరు ప్రధాన కార్యదర్శి కురువ మల్లయ్య మాట్లాడారు.

25న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

- సర్పంచి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

క్రిస్మస్ పండగ సందర్భంగా తెర్నేకల్ గ్రామంలో ఈనెల 25న ఎబిఎం చర్చి సంఘ పెద్దలు, యవ్వనస్తుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొని జట్లు ఈనెల 24లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.30 వేలు (వైసిపి రాష్ట్ర నాయకులు, జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి), రెండో బహుమతి రూ.20 వేలు (వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధుసూదన్ రెడ్డి), మూడో బహుమతి రూ.10 వేలు (ఎంపిపి భర్త దాసరి లుముంబ), నాలుగో బహుమతి రూ.5 వేలు (ఉప సర్పంచి భర్త కనుక ఈరన్న, ఎంపిటిసి శ్రీనివాసులు) ఇవ్వనున్నట్టు తెలిపారు. వివరాలకు 9642045942, 9966558718 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బిజెపిది నియంత పాలన

- ఇండియా కూటమి నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

పార్లమెంట్‌లో ఇండియా కూటమి పార్టీల ఎంపీలను సస్పెన్షన్ చేయడం బిజెపి నియంత పాలనకు నిదర్శనమని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చిప్పగిరి లక్ష్మీనారాయణ, సిపిఐ మండల నాయకులు హోతూరప్ప, బీఎస్పీ ఇన్‌ఛార్జీ రామలింగ తెలిపారు. శుక్రవారం ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం నాయకులు మైనా అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్‌లో పొగ బాంబు దాడిపై పార్లమెంటు భద్రత పరిణామాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ, బిజెపి ప్రభుత్వం చేస్తున్న నల్లచట్టాలపై చర్చ పెట్టాలని ప్రశ్నించిన ప్రతిపక్ష ఎంపీలను సస్పెన్షన్ చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కేవలం కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కావాల్సిన నల్లచట్టాలు చేసుకునే ప్రయత్నంలో ప్రతిపక్ష ఎంపీలు చర్చకు పట్టుబడతారని ఎంపీలను సస్పెన్షన్‌కు గురి చేసినట్లు తెలిపారు. బిజెపి నియంత పాలనకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిపిఎం నాయకులు కృష్ణ, గోవర్ధన్, సిపిఐ నాయకులు గోపాల్, కాంగ్రెస్ ఆలూరు మండల అధ్యక్షులు తుమ్మలబీడు లక్ష్మన్న, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగలపాడు మంజునాథ్, కరెంటు గోవిందు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వరకుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, ఎస్సీ సెల్ హాలహర్వి, చిప్పగిరి మండలాల అధ్యక్షులు విజయ్ కుమార్, కాజీపురం రాంబాబు పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** స్థానిక గాంధీ పార్కులోని గాంధీ విగ్రహం ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షులు దిలీప్ దోక మాట్లాడారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, కాంగ్రెస్ కార్యదర్శి సాయినాథ్, ఆదోని యువజన అధ్యక్షులు దేవి శెట్టి వీరేష్, జిల్లా మైనారిటీ ప్రెసిడెంట్ నూర్ అహ్మద్, పట్టణ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ సుంకన్న, ఐఎన్‌టియుసి జయరామ్, మాణిక్యరాజు, మద్దిలేటి, నిస్సార్ అహ్మద్, రామన్న యాదవ్, మోహన్ రెడ్డి, అసదుల్లా, రాము పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న ఇండియా కూటమి పార్టీ నాయకులు

జనవరి 15 నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి

- డివిజన్ హౌసింగ్ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీలోని ఇంటి నిర్మాణాలను జనవరి 15 నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని మండల హౌసింగ్ అధికారులకు హౌసింగ్ ఇఇ ప్రభాకర్, డిఇ ఆదినారాయణ సూచించారు. శుక్రవారం చిప్పగిరి జగనన్న కాలనీలో ఎంపిడిఒ సివి.కొండయ్య, మండల హౌసింగ్ ఎఇ భవ్య ఆధ్వర్యంలో హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకునే లబ్ధిదారులందరికీ పూర్తి అవగాహన కల్పించి హౌసింగ్ నిర్మాణ బిల్లులు ఎప్పటికప్పుడు అందేలా చూడాలని తెలిపారు. కలెక్టర్ సృజన ఆదేశాల మేరకు జనవరి 15 నాటికి నిర్మాణాలు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. అందుకనుగుణంగా హౌసింగ్ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. నాసిరకం నిర్మాణాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు.

హౌసింగ్ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బసలదొడ్డి గ్రామంలో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు రాగపాటి బజారప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న రైతు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారని తెలిపారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివేళలా ఆదుకొని అండగా ఉండాలన్నారు. కుటుంబానికి మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఐటిడిపి కృష్ణ పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తేనే ఉన్నత శిఖరాలు

- మోటివేషన్ స్పీచ్‌లో లాయర్ పవన్

ప్రజాశక్తి - చిప్పగిరి

సమాజంలో గుర్తింపు పొందాలన్నా, ఎంచుకున్న సబ్జెక్టులో వంద శాతం మార్కులు సాధించాలన్నా మెళకువలను పాటించాలని మోటివేషన్ స్పీచ్ ద్వారా లాయర్ ధారా పవన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువుపై మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు బోధించే సమయంలో ఏకాగ్రత అవసరమని తెలిపారు. విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తే అర్థమవుతుందో తెలుసుకొని ఉపాధ్యాయులు ముందుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో మెళకువలు పాటించిన వారు ఎన్నో ఉన్నతమైన ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని తెలిపారు. ఎంఇఒ బాల నాయుడు, ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న, యాసీన్ పాల్గొన్నారు.

24న మైనార్టీ సదస్సు : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఎమ్మిగనూర్ రోడ్డులో ఉన్న జెబి.గార్డెన్స్‌లో ముస్లిం, మైనారిటీ ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాష, జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజీబ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గపు ముస్లిం, మైనారిటీ నాయకులు, ముస్లింలు, కార్యకర్తలు, అభిమానులు, ఈ ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సుకు శాసనమండలి మాజీ చైర్మన్, పొలిట్‌బ్యూరో సభ్యులు అహ్మద్ షరీఫ్, మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్ఎమ్‌డి.ఫరూక్ హాజరు కానున్నారని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ అప్సర బాష

గణితాన్ని సులభంగా నేర్పాలి

- ఎంపిపి నసురుద్దీన్

- ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - గోనెగండ్ల

విద్యార్థులకు గణితం అంటే భయం లేకుండా కృత్యాల ద్వారా సులభంగా నేర్పించాలని ఎంపిపి నసురుద్దీన్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఎంపిపి నసురుద్దీన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు టి.బందే నవాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన గణిత ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు గణితం అంటే భయం లేకుండా 'డూయింగ్ బై లర్నింగ్' కృత్యాల ద్వారా లెక్కలను సులభంగా నేర్పించాలని తెలిపారు. అనంతరం గణిత ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఇఒ-1 రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, పాఠశాల కమిటీ చైర్మన్ పి.ఉస్మాన్, ఉపాధ్యాయులు జె.ఉస్మాన్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ప్రతిభ హైస్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, సెక్రటరీ సయ్యద్ మొయినుద్దీన్, ఉపాధ్యాయులు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులు జయలక్ష్మి, పరమేష్, భీమేష్ మాట్లాడారు. విద్యార్థులు గణితం అంటేనే భయానికి గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులు తరగతి గదిలో శ్రద్ధగా గమనిస్తూ విని, ఇంటిదగ్గర సాధన చేస్తే సులువుగా అలవాటు అవుతుందని సూచించారు. విద్యార్థులు రామానుజన్ సంఖ్య, గణిత గుర్తుల ఆకారంలో కూర్చున్న దృశ్యం, విద్యార్థులు తయారు చేసిన నమూనాలను చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌ఛార్జీ రాజు, రామలక్ష్మి, విరుపాక్షి, సునీల్, ముంతాజ్, శిరీష పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం బల్లేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తన్న మాట్లాడారు. గణిత ఉపాధ్యాయులు అశోక్, జయరాం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కేశవరెడ్డి, మల్లయ్య, కాశీ విశ్వనాథం, వాసవీ, బందెనవాజ్, జహీరా పాల్గొన్నారు. **ఆదోని**లోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గణిత శాఖ అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు రఫీక్, రజాక్, తిమోతి, బాలరాజు, రమేష్, బి.చిన్న, వెంకటేశ్వర్లు, సంతోష్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తిరుమల నగర్ లో ఉన్న అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్లో గణిత దినోత్సవ వేడుకలు కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. చిన్నారులు వివిధ పరికరాలు తయారు చేసి ప్రాముఖ్యతను వివరించారు. **దేవనకొండ**లోని రెయిన్‌బో పాఠశాలలో కరస్పాండెంట్ అల్లిపీరా ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రవి, సుభాన్, వీరేష్, రసూల్ బీ, వాణి, ఉమా, ఫాతిమా పాల్గొన్నారు.

గోనెగండ్లలో బహుమతులు అందజేస్తున్న ఎంపిపి

అమరావతి స్కూల్లో వేడుకలు

ఆదోనిలో విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న సిబ్బంది

కౌతాళంలో నివాళులర్పిస్తున్న యాజమాన్యం

బాల అకాడమీలో

141మంది ఎంపిల సస్పెన్షన్

దేశ చరిత్రలో ఓ చీకటి అధ్యాయం

- నల్ల బ్యాడ్జీలతో ఇండియా కూటమి, సిపిఎం నిరసన - ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తోందని మండిపాటు

రాస్తారోకో నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల : దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా 141 మంది రాజ్యసభ, పార్లమెంట్ సభ్యులను సస్పెన్షన్‌కు గురిచేయడం సిగ్గుచేటు అని , దేశ చరిత్రలో ఓ చీకటి అధ్యాయం అని సిపిఎం నాయకులు, కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పార్లమెంటులో అప్రజా స్వామికంగా 146 మంది విపక్ష పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు భద్రత పైన ప్రశ్నలు అడిగినటువంటి విపక్ష ఎంపీలందరినీ 146 మందిని ఏకపక్షంగా సస్పెండ్ చేసి, ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలు తీసుకొని తమకు అనుకూలమైన బిల్లులను ఆమోదింపజేసుకున్నారని అన్నారు. ఇందులో ఒక నియంతృత్వ బిల్లు ఎన్నికల కమిషన్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకుండా అధికార పార్టీ సభ్యులనే కమిటీ సభ్యులుగా నియమిస్తూ చేసిన బిల్లుతో భవిష్యత్తులో ఏకపక్షంగా ఎన్నికలను నిర్వహించడానికి తోడ్పడుతుందన్నారు. క్రిమినల్ అమెండ్మెంట్ చట్టంలో మార్పులు దేశద్రోహ చట్టాన్ని ఎత్తివేయాలని ఒక వైపు సుప్రీంకోర్టు చెబుతున్న అదే చట్టాన్ని మార్పులు చేసి మరింత కఠిన తరంగా ఉండేటటువంటి పద్ధతిలో ఈ క్రిమినల్ అమెండ్మెంట్ లలో చేర్చారన్నారు. ఈ చట్టం ద్వారా బిజెపి తమ ప్రత్యర్థులను నిరంకుశంగా శిక్షించడానికి ఉపయోగపడుతుందని, టెలికాం బిల్లును ప్రవేశపెడుతూ భవిష్యత్తులో టెలికాం సర్వీస్‌లను పోస్టల్ సర్వీసులను ప్రైవేటీకరణ చేసేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టారని,ఈ బిల్లులను ఆమోదిం ప చేసుకోవడానికి 146 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేసి ఏకపక్షంగా అప్రజా స్వామికంగా ఆమోదించుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ మాట్లాడుతూ బిజెపి నిరంకుశ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. భవిష్యత్తులో బిజెపి గనుక అధికారంలోకి వస్తే మైనార్టీలకు, దళితులకు, క్రిస్టియన్లకు, వెనుకబడిన కులాల వారిపై తీవ్రమైన దాడులు చేస్తారని, బిజెపి వ్యతిరేకంగా ప్రజలందరూ నిలబడాలని కోరారు. ఈ సభకు సిపిఎం పట్టణ నాయకులు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ నాయకులు శివ, నాయకులు సుబ్బారావు, జైలాను తదితరులు నాయకత్వం వహించారు. **ఆత్మకూరు :** పార్లమెంటు నుండి 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ముందర నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఏ. రాజశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు మాట్లాడారు. ఎంపిల బహిష్కరణపై రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వైసిపి, తెలుగుదేశం ఎంపీలు కనీసం స్పందించక పోవడం దారుణం అన్నారు. పార్లమెంట్‌లో మోడీ ప్రభుత్వ అప్రజాస్వామిక పోకడలపై గళమెత్తాలనివారు డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి పార్టీలు పార్లమెంట్‌లో తటస్థంగా ఉన్నామని చెబుతూనే బిజెపికి మద్ద తునిస్తున్నాయన్నారు. కనీసం ఈ రాష్ట్రంలో విశాఖ ఉక్కును కాపాడడానికి, పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ సాధించడానికి ఈ రెండు పార్టీలు కృషి చేయాలని, రెండు రోజుల్లో ఈ 2 పార్టీలు తమ స్పందనను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 మంది ఎంపీలు ఉండి ప్రధాన ప్రజా సమస్యలకు ఈ దుస్థితి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, ఇతర విద్యాశాఖ ఉద్యోగుల సమ్మె, నిరసనలను విరమింపజేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. అంగనవ్వాడీ యూనియన్‌తో ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాష్ట్రంలో పంటలు నష్టపోయి రైతులుంటే ఎంత నష్టం జరిగిందో గణనకు రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులను నియమించకుండా అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగుల గొట్టే బాధ్యతను అప్పగించడం రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాబాష, సుధాకర్, రామ్ నాయక్, జి. నాగేశ్వరావు, ఏ. సురేంద్ర, వీరన్న, క్రిష్ణ మోహన్, మహమ్మద్, గణపతి, రాజేష్, శాలు, సామెలు, మల్లయ్య, హుసేన్ సా, వలి, మాబాషా, ఖాదర్, కలిముల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. మిగతా 6వ పేజీలో...

అంగన్వాడీల రాస్తారోకో

- 11వ రోజుకు అంగన్వాడీల సమ్మె- మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యల పట్ల నిరసన

నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల రూరల్ : తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇచ్చేంతవరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల పేర్కొన్నారు. అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న 11వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా నంద్యాల తాసిల్దార్ కార్యాలయం నుండి టేక్కే, పద్మావతి నగర్ మీదుగా శ్రీనివాస్ సెంటర్ చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, పట్టణ అధ్యక్షులు చింతలయ్యలతో పాటు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తోట. మద్దులు, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి యం.నిర్మల ప్రాజెక్టు కార్యదర్శి టి.సునీత ప్రాజెక్టు నాయకురాలు నాగరాణి, ప్రసన్న, నీలిమ, లలితమ్మ, సరస్వతి, రాజేశ్వరిలతో పాటు 300 మంది అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో అంగన్వాడీలకు అడుక్కుతినే పరిస్థితులు దాపురించాయని 11 రోజుల నుండి సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరిం చకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా,దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్లను సచివాలయ సిబ్బందితో నడపాలని నిర్ణయించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సెంటర్లను సచివాలయాలకు అప్ప గిస్తామంటే సహించమని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రోత్సహించడం సిగ్గుచేటు అని వారు విమర్శించారు. సమ్మె వల్ల కలిగే పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు తక్షణమే స్వస్తి పలికి సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని వారు కోరారు. కార్మిక వర్గం కన్నెర్ర చేస్తే రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్, హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించడం, రాజకీయ జోక్యం అరికట్టడం,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచడం సర్వీస్‌లో ఉండి చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా అమలు చేయడం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంపు, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయడం, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు,ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని, వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్, ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డిలు, అంగన్‌వాడీ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు, మంత్రులు, ఇలా మహిళలను కించపరిచి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మిగతా 6వ పేజీలో...

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల : బాల అకాడమీ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గణిత దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు గణితమునకు సంబంధించిన అనేక అంశాలను తమదైన శైలిలో ప్రాజెక్టు రూపంలో తయారుచేసి ముఖ్య అతిథులను తల్లిదండ్రులను అందరినీ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమమునకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **గురురాజాలో..** శ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని గణిత ఫేస్ట్ ఎగ్జిబిషన్ ఆవిష్కరించారు. ఒలంపియాడ్, ఐఐటి విభాగంలోని విద్యార్థుల గణిత ప్రతిభా ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరి రెడ్డి మాట్లాడారు. స్టేట్ మ్యాథ్స్ సైన్స్ ఒలంపియాడ్‌లలో తమ విద్యార్థుల ప్రదర్శనలు ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి పాల్గొని మాథ్స్ ఎగ్జిబిషన్ నందు, క్విజ్ కాంపిటీషన్ నందు ప్రతిభ కలిగిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి గణిత శాస్త్ర పరిజ్ఞానాన్ని ప్రశంసించారు. **డోన్ :** గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామానుజనిత 'గణితం పుస్తకంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు లక్ష్మి కాంతరెడ్డి, మధుసూదన్ రెడ్డి,సుభాన్, విజయకుమార్, సురేష్, వెంకట రమణ, సుబ్బారాయుడులు మాట్లాడారు. గణితంపైన మక్కువ పెంచుకుంటే గణితం ఈజీ అని సమస్య పరిష్కారానికి గణిత ఉపాధ్యాయులు చేయూత నిస్తామన్నారు. విద్యార్థులు అనేక నాటికలు ప్రదర్శించగా అనంతరం గణిత ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిగతా 6వ పేజీలో...

మున్సిపల్ కార్మికుల సమస్యలపై

26 నుండి నిరవధిక సమ్మె

- ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్

పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మున్సిపల్ వర్కర్స్ మీటింగ్లో మాట్లాడుతున్న సి ఐటీయూ నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఆప్కాస్ సిబ్బందికందరికీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్లు, ఇంజనీరింగ్ సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్టు సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కె మహమ్మద్ గౌస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, భాస్కరాచారి, రామకృష్ణ, ఆదాము, రామాంజనేయులు, నాగేశ్వరరావు, మురళీలతో పాటు మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కే మహమ్మద్ గౌస్, యూనియన్ అధ్యక్ష కార్యద ర్శులు కృష్ణయ్య, భాస్కరాచార్యులు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని మాట తప్పి ఆప్కాస్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందని ఆప్కాస్ వద్దు - పర్మినెంట్ చేయాలన్నారు. ఆప్కాస్ సిబ్బంది అందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యూటి సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని,అర్హులైన వారికి స్కిల్డ్ , సెమి స్కిల్డ్ వేతనాలను ఇవ్వాలని నాలుగు సంవత్సరాల కాలంలో అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహి ంచిన రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు అమలు చేయకపోవడం వల్లనే ఈనెల 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్తున్నారన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టు వీడి కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. **ఆత్మకూర్:** మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 26 నుండి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగురాజులు తెలిపారు. ఈమేరకు వారు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జీవరత్నమ్మ, సామక్క, కృష్ణుడు, హెూసన్నా, బీసన్న, నాగన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో 25 వరకు అభిషేకాలు రద్దు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శనివారం నుండి 25వ తేదీ వరకు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లకు ఆర్జిత, అభిషేకాలు రద్దు చేస్తున్నట్లుగా దేవస్థానం కార్య నిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 23న ముక్కోటి ఏకాదశి శనివారం సెలవు రోజు కావడంతో అదే విధంగా ఆది, సోమవారం సెలవు దినాలు కావడంతో భక్తుల సంఖ్య శ్రీశైలానికి అధికం గా వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్వామి అమ్మ వార్ల దర్శనం కల్పించేందుకు గాను గర్భాలయ అభిషేకాలు సామూహిక అభిషేకాలు ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనం వంటి సేవలు రద్దు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. స్వామి అమ్మవారలను దర్శించుకునేందుకు శీఘ్ర అతి శీఘ్ర ఉచిత క్యూలైన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బంధవస్తున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

అభివృద్ధే వైసిపి ప్రధాన లక్ష్యమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని 18 వార్డు అలా వీధి నందు సీసీ రోడ్డుకు మున్సిపల్ చైర్మన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ 18వ వార్డు నందు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు స్పెషల్ గ్రాంట్స్ ద్వారా వచ్చిన నిధులు సిఎండిఎఫ్ నుంచి వచ్చినటువంటి 35 లక్షల రూపాయల నిధులతో సిసి డ్రైన్లు,సీసీ రోడ్లు,సీసీ కల్వర్టులు వేయిస్తున్నామని తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలోని 32 వార్డులకు 6 కోట్ల 40 లక్షల రూపాయలు స్పెషల్ గ్రాంట్స్ మంజూరు చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,డిఈ రసూల్,ఏఈ సురేష్,మున్సిపల్ వైస్ చైర్మెన్లు హరికిషన్,జాకీర్ హుస్సేన్,వార్డు కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన పని దినాలు పూర్తి చేయాలి : పిడి

ప్రజాశక్తి - చాగలమర్రి

జాతీయ స్థాయిలో నికరమైన పని దినాలు కావాల్సిన వారికే ఉపాధిహామి జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారని నంద్యాల జిల్లా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల 8 వేల జాబ్ కార్డులను మంజూరు చేశామన్నారు. వారిలో కొన్ని కుటుంబాలు 90 రోజులు మాత్రమే పనిచేయడం జరిగిందన్నారు. అలాంటి వారికి 100 రోజులు పని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. జాబ్ కార్డులు కలిగిన కొంత మందికి పనిచేయాల్సిన అవసరం లేక పోవడంతో వారు పనికి హాజరు కావడం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి వారి జాబ్ కార్డులను తాత్కాలికంగా తొలగించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను పలుమార్లు ఆదేశించినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వీరిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని ఆయన సూచించారు. అలాగే జాబ్ కార్డుదారులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ సిడింగ్, మ్యాపింగ్ వచ్చే ఏడాది జనవరి నెల 1వ తేదీకల్లా చేయించుకోకుంటే వారి ఖతాలో కూలీ డబ్బులు జమా కావన్నారు. అలా చేయించుకోలేక పోయిన వారు రూ.250 చెలించి ఆయా గ్రామాలలోని పోస్టాఫీసులో కొత్తగా ఖాతా తెరచుకోవచ్చన్నారు. ఈ ఏడాది 300 ఏకరాలలో సబ్సిడీ ద్వారా పండ్ల మొక్కుల పెంపకం 600 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటల పెంపకం చేపట్టాలని ఉన్నత అధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వం ఉపాధిహామి పథకం ద్వారా రైతులు ఉద్యానవన పంటలతో పాటు ఫారం ఫాండ్స్, 1 ఏకరం విస్తీర్ణంలో మిని అమత్ సరోవర్లను ఏక్కువగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతే కాకుండా మండలంలో చేపట్టిన 27 రూఫెఫ్. హార్వేస్టర్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహమ్మద్ దోలా,ఎపిఓ నిర్మలాదేవి టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటయ్య ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పీడీ రామచంద్రారెడ్డి

పరామర్శిస్తున్న భూమా అఖిలప్రియ

రానున్నది టిడిపి ప్రభుత్వమే : భూమా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్నది టిడిపి ప్రభుత్వమేనని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎల్.ఎం కాంపౌండ్ వీధిలో శుక్రవారం సాయంత్రం టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మిని మేనిఫెస్టోలో టిడిపి పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలను, అమలు చేసే సంక్షేమ పథకాలను గురించి ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కౌన్సిలర్ హుస్సేన్ భాష, అనంత రామసుబ్బారెడ్డి, గుండామని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణం లోని పడకండ్ల గ్రామానికి చెందిన నల్లగట్ల ఓబుళపత్తి గారి భార్య మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న భూమా అఖిలప్రియ వారి నివాసానికి వెళ్ళి కుటుంబాన్ని పరామర్శించారు.

రవి కృష్ణకు జాతీయ ఐఎంఏ ఉత్తమ రాష్ట్ర అధ్యక్ష పురస్కారం

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా ఈ సంవత్సరంలో డాక్టర్ జి.రవికృష్ణ రాష్ట్రంలో నూతనంగా వెయ్యి మంది వైద్యులను ఐఎంఏ సభ్యులుగా చేర్చు కోవడం తద్వారా మొత్తం రాష్ట్ర ఐఎంఎ సభ్యుల సంఖ్య ఇరవై వేలు దాటేలా చేసినందుకు, కొత్తగా ఆరు నూతన శాఖలు ప్రారంభించడంలో, పలు నిరంతర వైద్య విద్యా సదస్సులు నిర్వహించినందుకు, ఐఎంఏ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషికి, వివిధ వైద్య సేవా కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించిన దానికి గుర్తింపుగా జాతీయ ఐఎంఏ "ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా జాతీయ పురస్కారం" ఢిల్లీలో ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ నాయక్ ప్రకటించారు. ఈనెల 27వ తేదీ తిరువనంతపురంలో నిర్వహించనున్న 98వ జాతీయ ఐఎంఏ సదస్సులో ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నారు. డాక్టర్ రవి కృష్ణకు పురస్కారం ప్రకటించిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ నాయకులు, సభ్యులు హర్షం ప్రకటించారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

మండలంలోని టంగుటూరుకి చెందిన వైసీపీ నాయకులు గాలి చంద్రశేఖర్ రెడ్డి, అతని అనుచరులు వైసీపీని వీడి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం మండ లంలోని టంగు టూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో గాలి చంద్రశేఖర్ రెడ్డి అతని అనుచరులు టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి టిడిపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివపుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల బాంధవుడు చంద్రన్న బుక్‌లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

బీసీ బాంధవుడు చంద్రన్న : బీసీ

ప్రజాశక్తి బనగానపల్లె

బీసీల బాంధవుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ బంధావుడు మన చంద్రన్న బుక్‌ను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల సైకో సీఎం పాలనలో 74 మంది బీసీ నేతలు హత్యలకు గురయ్యారని, 5 వేల మందిపై దాడులు జరిగాయని ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్స్ అమలు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. సంక్షేమ పథకాలకు అదనంగా సబ్ ప్లాన్ ద్వారా 36,475 కోట్ల రూపాయలు, 4.20 లక్షల మందికి ఆదరణ పరికరాలు, బీసీ కార్పొరేషన్ల ద్వారా 3700 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత టిడిపిది అన్నారు. బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత ఈ అసమర్థ జగన్ సర్కార్‌కే దక్కిందని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే బీసీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల భద్రత కోసం రక్షణ చట్టం తీసుకువస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర నాయకులు తిరుపాల్ బాబు, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు శంకర్. ఉపాధ్యక్షులు పసుపల బాల నాయుడు , నాయకులు కటికే వానికుంట బాలరాజు యాదవ్, పిల్లి నాగయ్య యాదవ్, క్రిష్ణగిరి రంగస్వామి యాదవ్ ,వేములపాడు గుర్రప్ప.మంగంపేట శ్రీనివాసులు, చెంచు బోయిన వెంకట రాముడు యాదవ్, కామేశ్వరుడు చిన్న రాజుపాలెం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు

నందికొట్కూరు : మండలంలో బొల్లారం గ్రామంలో టిడిపి నాయకులు జయ సూర్య, వీరం ప్రసాద్ రెడ్డి, ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సూపర్ సిక్స్ పథకాలను ఇంటి ఇంటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీరం ప్రసాద్ రెడ్డి, సుందర్ రెడ్డి, వివేక్ రెడ్డి, సుంతల పల్లె గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామ్ రెడ్డి, రామ్ నాయుడు కాశి, రాముడు, షాల్మియా, రవి, అల్లూరు శ్రీనివాసులు, శ్రీను, వెంకటేశ్వర్లు, పరమేష్, దస్తగిరి రెడ్డి, రత్నం, గిరి, దాసు, స్వాములు నాగరాజు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మొదటి ప్రయత్నంలోనే

రైతు బిడ్డకు ఎస్ఐ ఉద్యోగం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని తోడేండ్ల పల్లె గ్రామానికి చెందిన ఓబులేసు, వెంకట లక్ష్మమ్మ దంపతుల రెండవ కుమారుడైన మైదుకూరు వీర ప్రతాప్ ఇటీవల విడుదలైన ఎస్ఐ ఫలితాలలో మొదటి ప్రయత్నంలోనే ఏపిఎస్పి విభాగంలో ఎస్ఐ జాబ్ సాధించాడు. వీరప్రతాప్ 2020లో ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా సాఫ్ట్వేర్ జాబ్ను వదిలేశాడు. గ్రామంలో తండ్రికి వ్యవసాయంలో సహాయం చేస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతూ మొదటి ప్రయత్నంలోనే ఎస్ఐ జాబ్ సాధించాడు. ఎస్ఐ జాబ్ సాధించిన వీర ప్రతాప్‌ను గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్‌చే శ్రీమద్రామాయణం, మహాభారతం భగవద్గీతలపై ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు అత్యంత శ్రవణానందం కలిగించాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, ఆలయ కమిటీ, భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

వైసిపికి పతనం తప్పదు

- మాండ్ర శివానందరెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు

వచ్చే ఎన్నికల్లో వైసిపికి పతనం తప్పదని నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. యువగళం విజయవంతం సందర్భంగా నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర స్వగృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో టిడిపి, జనసేన కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తప్పదని, ఎన్నికలలో దాదాపు 160 స్థానాలలో గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద రెడ్డి, రమేష్ రెడ్డి, గిరీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, జనార్దన్, జమీల్, సర్పంచ్ నాగలక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, లాడెన్, బాబు, బాబుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం : శాంతి ప్రియ

ప్రజాశక్తి - మహానంది

కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగస్వాములం అవుదామని డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జాతీయ కుష్టు వ్యాధి నివారణపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో అవగాహన సదస్సు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు కుష్టు వ్యాధి లక్షణాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.హెచ్. ఓ.హుస్సేన్ రెడ్డి, ఏఎన్ఎంలో ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

5వ పేజీ తరువాయి.. సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** శ్రీనివాస రామానుజన్ జయంతినిపురస్కరించుకొని స్థానిక హైస్కూల్ నందు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీనివాస రామానుజన్ గణిత మేధావి జీవిత చరిత్రను పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి చలపతి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి రామానుజన్‌ను గుర్తుకు తెచ్చుకుంటూ గణితంలో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాపిలి : గణితం పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తిని పెంచుకోవాలని ఈ ఓ ఆర్ డి బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. శివసాయి పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడి క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలా సురేష్, శ్రీదేవి,నాగరాజు ఉపాధ్యాయ బందం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

విజయానికేతన్‌లో ..ప్యాణ్యం : జీవితంలో గణితం ఒక భాగం అయిందని దానిని జీవితం నుండి వేరుచేయలేమని విజయా నికేతన్ డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ స ందర్భంగా డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మా మాథెమాటిక్స్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇంఛార్జి మురారివేణుగోపాల్, కో ఆర్డినేటర్ బ్రహ్మం, సిబ్బంది సుబ్బయ్య,జహీర్,నాయక్, నాగరాజు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్లోకలో నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు పట్టణంలోని శ్లోక సిబిఎస్ఇ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ కవితా రెడ్డి పాల్గొని గణిత శాస్త్ర ప్రాధాన్యత గురించి విద్యార్థులకు సందేశం ఇచ్చారు. విద్యార్థులు గణిత శాస్త్ర నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జె. శ్రీనివాసరెడ్డి , చైర్మన్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిరెడ్డి, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఈశ్వర్, చక్రవర్తి, న్యామత్ బాష, శ్రీజ, శివ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: కస్తూర్బా పాఠశాలలో గణితశాస్త్ర దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె విద్యార్థులకు గణిత శాస్త్రం ప్రాముఖ్యతను వివరించామన్నారు.

గడివేముల : శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్స్, గణిత రంగోలిలు, యాక్టివిటీస్ చాలా అద్భుతంగా చేసి వివరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఎం. రామేశ్వర రావు, ప్రసంగించారు. **పగిడ్యాల :** పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు, ఉపాధ్యాయులు కష్ణ, శైలజ, ఉల్ఫాతునిసా, రమేష్, కరిముల్లా, శివ, క్రీడా శ్రీ తోకల పీతాంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు : కస్తూర్బా పాఠశాలలో గణిత డే పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

బనగానపల్లె : మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథమెటిక్స్ మెజీషియన్ శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి ల ఆర్థిక సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, కృష్ణయ్య, దాదాభాష, సుధాకర్, నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు మల్లారెడ్డి, నాగేష్ బాబు పాల్గొన్నారు.

విజయానికేతన్‌లో

నందికొట్కూరు టౌన్ శ్లోకలో

అన్న ప్రసాద పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం క్షేత్రం ని సందర్శించి యాత్రికులకు నిత్యం అందిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం నాడు హైదరాబాద్ కు చెందిన సి.వి వాసుదేవరాయ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,01,116 ఆలయ పర్యవేక్షకులు పి దేవికకు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు.

ఆలయ అంగళ్లకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల మండల కేంద్రంలో వెలిసిన శ్రీ మూల పెద్దమ్మ దేవస్థానం నందు టెంకాయలు ,పూలు మాలలు (పూజా సామగ్రి) ఒక సంవత్సర పాటు అమ్ముటకు గాను శుక్రవారం నాడు బహిరంగ వేలము ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో నంద్యాలకు చెందిన శ్రీ సి- యాదగిరి 40000 రు వేలంపాడి దక్కించు కొన్నారు. ఈ కార్యక్రమములో నంద్యాల తనిఖదారు. ఎస్. శశికుమార్. దేవస్థానము చైర్మన్. తలారి. చిన్నన్న, కార్యనిర్వహణాధి ఎస్ మోహన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఐ మారుతి శంకర్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

అంగన్వాడీలపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై మారుతి శంకర్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్కా కుమార్ అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరరావులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం ఎస్ఎఫ్ఐ ఖండిస్తున్నామని అన్నారు. ఎస్ఐను సస్పెండ్ చేయాలని, లేనియెడల ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో హరి వర్ధన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల అభివృద్ధికి కృషి

- నంద్యాల జిల్లా గౌరవ వన్యప్రాణుల సంరక్షకులు ఏవిఎన్ రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్ర ప్రభుత్వం అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ పర్యవేక్షణ ప్రతిష్ట పరిచేందుకు నంద్యాల జిల్లా గౌరవ వన్య ప్రాణుల సంరక్షకులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆవుల వెంకటనారాయణ రెడ్డిని ప్రభుత్వం నియ మించింది. శుక్రవారం వెంకటనారాయణ రెడ్డి సున్నిపెంటలోని టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కార్యాలయం నందు ఆయన బాధ్యతలు చేపట్టారు. పిసిసిఎఫ్ మధుసూదన్ రెడ్డి ఐఎఫ్ఎస్, ఎఫ్‌డిపిటి మూర్తి, ఐఎఫ్ఎస్‌లు వెంకట నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏవిఎన్ రెడ్డి ఇష్టకా మేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆలయ పరిసర ప్రాంతా లను పరిశీలించారు. భక్తులకు టాయిలెట్స్ సౌకర్యం లేకపోవడంతో ఏవిఎన్ రెడ్డి మరుగుదొడ్లను నిర్మిస్తానని తెలిపారు. అనంతరం ఫారెస్ట్ అధికారులతో అడవుల అభివృద్ధి వన్యప్రాణుల సంరక్షణపై చర్చించారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి ఫారెస్ట్ అధికారుల వరకు వన్యప్రాలను సంరక్షించేందుకు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు. వేసవి సంభవిస్తున్న దృష్ట్య వన్య ప్రాణులకు తాగునీరు కోసం అడవిలో నీటి తొట్లు ఏర్పాటు చేసే విషయమై, పులులు అభివృద్ధి చెందేందుకు అడవి బర్రెల పెంపకంపై చర్చించారు. వన్యప్రాణుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. మార్కాపురం డీఎఫ్వో, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1 నుండి నల్లమల్లలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి - రుద్రవరం

2024 జనవరి 1 నుంచి అహోబిలం నల్లమల అడవుల్లో పూర్తిగా ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అహోబిలం నల్లమల్ల అడవుల్లో ఎగువ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి, పావన లక్ష్మీనరసింహస్వామి, క్షేత్రాలు ఉన్నందున భక్తులు ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగిస్తున్నారన్నారు. వన్యప్రాణులు వీటిని తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ తయారుచేసిన వస్తువులను కవర్స్‌ను అడవులకు తీసుకొని పడేస్తే రూ. 2000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు, భక్తులు, బాటసారులు, ఫారెస్ట్ అధికారులకు సహకరించి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని ఆయన కోరారు.

బండి ఆత్మకూర్ : రాష్ట్రంలో నాలుగు జిల్లాల్లో విస్తరించిన నల్లమల్ల అభయారణ్యం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రభుత్వం గుర్తించడం జరిగిందని బండి ఆత్మకూరు మండల పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా ప్రభుత్వం గుర్తించిందని నల్లమల్ల అభయా రణ్యంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు జారీ చేశాయని బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్జా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల అభయారణ్యంలో పుణ్యక్షేత్రాలు వెలిసి ఉండడం వాటి వద్దకు వెళ్లే భక్తులు యాత్రికులు తమ పూజ అవసరాల కోసం తినుబండారాల కోసం ప్లాస్టిక్ బ్యాగులు వినియోగించడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. జనవరి ఒకటో తేదీ నుండి నిషేధాజ్ఞలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. భక్తుల పేపర్ బ్యాగులు కవర్లు వాడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మొబైల్ పార్టీ డిప్యూటీ రేంజర్ నాగేంద్ర నాయక్, ఎఫ్ఎస్ఓలు రవీంద్ర నాయక్, తేజ, వెంకటసుబ్బయ్య, ఎఫ్ఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గైడ్స్ పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు వీచే బాల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి విద్యార్థినీలకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థు లకు క్రీస్తు బాల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకా రంతో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లను పం పిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ హాస్టళ్ల లోని 430 విద్యార్థులకు గైడ్స్ విలువ రూ.1.60 లక్షల విలువచేసే ఆల్ ఇన్ వన్ గైడ్లను లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఒక ఆశయం ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. తమ అన్న కీర్తిశేషులు బిసి బాలతిమ్మారెడ్డి పుస్తకాలు చదివేందుకు ఎక్కువ ఆసక్తి చూపేవారని, ఆయన జీవిత కాలంలో కొన్ని వేల పుస్తకాలు సేకరించి భద్రపరిచారన్నారని తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పేద విద్యార్థులకు ఉపయెగపడేలా మంచి కార్యక్రమం చేయాలని నిర్ణయించారని, అందులో భాగంగానే గైడ్స్‌ను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థిని , విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, గోకులదున్నె మదుసూదన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇన్ వన్ గైడ్లను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

141మంది ఎంపిల సస్పెన్షన్

దేశ చరిత్రలో ఓ చీకటి అధ్యాయం

5వ పేజీ తరువాయి..

నంద్యాల కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి సభ్యులను పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం నియతత్వ ధోరణితో విపక్ష పార్టీల గొంతు నొక్కి అన్యాయంగా సస్పెండ్ చేశారని అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి సభ్యులు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలో భాగంగా ఏఐసీసీ ఆదేశానుసారం, పిసిసి, డీసీసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నంద్యాల టౌన్ అధ్యక్షులు చింతలయ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలతో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలతో స్థానిక శ్రీనివాస్ సెంటర్ నందు వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ మసూల్దార్ ఫరూక్, రాష్ట్ర ప్రధాన సెక్రటరీ మోహన్ రావు, నంద్యాల టౌన్ అధ్యక్షులు చింతలయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి వాసు, టౌన్ ట్రెజరీ ప్రసాద్, రాష్ట్ర ఎస్ సి సెల్ కరాటే బాలకృష్ణ, నంద్యాల జిల్లా సెక్రటరీ మసూల్దార్ అబ్దుల్ రహమాన్, సహాయ సెక్రటరీ కరీముల్లా, చేబోల్ సలాం, మైనార్టీ నాయకులు ముహమ్మద్ రఫీ, అహమ్మద్ హుస్సేన్, రాష్ట్ర సేవాదళ్ మస్తాన్ ఖాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో

5వ పేజీ తరువాయి.. **బేతంచెర్ల :** అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేస్తూ రోడ్డున పడే పరిస్థితి తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి సేబారాణి, సిఐటియు జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు అన్నారు. అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరుకున్న సందర్భంగా అంగన్వాడీ నాయకురాల్లు ఎన్కే. నాగలక్ష్మి, ఎస్ గుల్జార్బి ఆధ్వర్యంలో భారత్ బేకరీ సర్కిల్ నందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంజలి, ఈ అనూష, మేరీ, బి లక్ష్మీదేవి, పద్మావతి, ఐ. జ్యోతి, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, సరోజ, రాధమ్మ,విజయలక్ష్మి, లక్ష్మీపార్వతి, సంతోష, భూలక్ష్మి సరళ మహాలక్ష్మి నారాయణమ్మ సువర్ణ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** ప్రభుత్వం స్పందించి అంగనవాడిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యాక్షులు రణధీర్, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు సుధారాణిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె 11రోజు చేపట్టడం జరిగింది. అనంతరం పట్టణంలోని బస్టాండ్ ఎదుట రాస్తో రోకో నిర్వహించారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు వాణి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, ప్రియాంక, రవణమ్మ, అరుణ, రైతు సంఘం నాయకులు మా భాష, వీరన్న, సిఐటియు నాయకులు సురేంద్ర, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు : అంగన్వాడీలు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు రజక సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణలు మద్దతు తెలిపారు. జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, అంగన్వాడీ వర్కర్స్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణమ్మ బాయ్, శ్రీలత పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు రాస్తారోకో నిర్వహించారు. ఎంపీడీవో కార్యాల యం నుండి పెట్రోల్ బంక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్లయ్య మాట్లా డుతూ అంగన్వాడి వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జే వి సుబ్బయ్య, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రోజా, రమణి, సెక్టార్ సభ్యులు రమాదేవి, మల్లేశ్వరి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: సిఐటియు, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పద్మావతి, వసంత, సంజమ్మ, వై పద్మావతి, నాగమణి, ఏఐటియుసి నాయకురాలు చంద్రకళ, వహీదా, ఇందుమతిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైటాయిం చారు. **కొత్తపల్లి :** రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ శరణ్ వ్యాఖ్యలకు నిరసనగా అంగన్వాడీలు స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి రాస్తారోకో చేశారు. అనంతరం కుక్కకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకురాలు ఈ హరిత, కొత్తపల్లి దుద్యాల సెక్టార్ల నాయకురాలు నాగమణి, రాజమ్మ మాట్లాడారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** అంగన్వాడీల నిరవధిక సమ్మెకు ఎన్ఎంఆర్ కార్మికులు, డ్యామ్ సైట్ ఫోటోగ్రాఫర్లు, ఐస్‌క్రీమ్ అమ్ముకునే కార్మికులు శిబిరంలో కూర్చుని సంఘీ భావం ప్రకటించారు. అనంతరం శిబిరం నుండి రింగు పార్కు సెంటర్కు ర్యాలీగా బయలుదేరి రింగ్ పార్కు దగ్గర రాస్తారోకో నిర్వహించగా శ్రీశైలం వచ్చే యాత్రికుల కార్లు, ఆర్టీసీ బస్సులు దాదాపుగా అర్ధ కిలోమీటర్ వరకు ట్రాఫిక్ ఏర్పడింది. ఈ సందర్భంగా పివి. రమణమ్మ, కాశమ్మ, ఐఎఫ్‌టియు నాయకులు ఆశీర్వాదం మాట్లాడారు. **బండి ఆత్మకూర్ :** సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బన్నలతో కలిసి నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. **రుద్రవరం :** అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద వంట వార్పుతో నిరసన చేశారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీగా వెళ్లి అమ్మవారి శాల వద్ద చాగలమర్రి టు గాజులపల్లె రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, అంగన్వాడీ నాయకురాలు బిబి, మనోజ మాట్లాడారు. **మిడ్తూర్:** అంగన్వాడీల పట్ల అసభ్యంగా మాట్లాడిన జూపాడుబంగ్లా ఎస్సై మారుతి శంకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పి,పకీరు సాహెబ్, టి ఓబులేసు, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, జి లింగస్వామి డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి లక్ష్మి కుమారి అధ్యక్షతన స్థానిక బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీరు సాహెబ్, జిల్లా నాయకులు టి ఓబులేసు, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, జి లింగస్వామి మాట్లాడారు. **పాణ్యంలో** సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. సిఐటియు మండల కార్యదర్శి కే భాస్కర్, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి నాగమణి, ఏళ్ల సుబ్బయ్య, మండల నాయకులు రామ్ మద్దిలేటి, యూనియన్ మండల కార్యదర్శి వసంతమ్మ మాట్లాడారు. **వెలుగోడు :** పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి, రవణమ్మ, సుమిత్రమ్మ పాల్గొని మాట్లాడారు. **నందికొట్కూరు టౌన్:** జూపాడుబంగ్లా ఎస్ఐ మారుతి శంకర్‌ను సస్పెండ్ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకులు బేస్తరాజు డిమాండ్ చేశారు. నందికొట్కూరు పటేల్ సెంటర్లో అంగన్వాడి వర్కర్స్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సమ్మెకు మద్దతుగా టిడిపి నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి శివానందరెడ్డి, టిడిపి నాయకులు రమేష్ రెడ్డి, గిరీష్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, జయ సూర్య, ముత్తుజావలి, లాయర్ జాకీర్ తదితరులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. మదర్ బి, సిఐటియు మండల కార్యదర్శి నాగన్న, వ్యకాసం నాయకుడు కొంగర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** సమస్యలు పరిష్కారానికి అంగన్వాడీ కార్యకర్తలు 11వ రోజు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోఉరి వేసుకొని, కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సాజిదాబి, వరలక్ష్మి, పద్మావతమ్మ, ప్రభావతి, నారాయణమ్మ, స్వర్ణలత, నాగమణి, హైమావతి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** తాసిల్దార్ కార్యాలయం వద్ద బెంగళూరు విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి పైన గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పద్మావతి లీలావతి మాట్లాడారు.

ఉరేసుకుని నిరసన తెలుపుతున్నాను అంగన్వాడీలు

జేడీఆర్ కు సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీసు రూలు 242 నోటీసు
మహారాజశ్రీ బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం : 27/2023 in ఓ.యస్.నెం : 199/2019

గూటూరు శేషపణి. ...డి. హెచ్. ఆర్

యెదిరి

తాళంకి ఆది శేషయ్య. ...జె. డీ. ఆర్

డిహెచ్ ఆర్ :
తాళంకి ఆది శేషయ్య, తండ్రి: రామ చంద్రయ్య
హిందూ, వ్యాపారము, పెండేకంటి నగరు,
బనగానపల్లె టవును మరియు మండలము,
కర్నూలు జిల్లా.

జే డీ ఆర్ కు సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీసు రూలు 242 నోటీసు

పై అమలు అర్జీలో డిక్రీ దారు ఐన గూటూరు శేషఫని నీ బ్యాంకు డిపాజిట్ మొత్తము జప్తి మరియు సెండ్పర్ కోరి పిటిషను దాఖలు చేసినాడు కావున మీరు 11-01-2024 వ తేదీ న ఉదయం 10-30గం. స్వయముగా గాని వకీలు ద్వారగాని ఏదైన ఆక్షేపణలు వుంటే తెలుపుకోగలరు, లేనిపక్షములో దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి వుత్తరువు మేరకు)

వాయిదా తేదీ : 11-01-2024

సి. శ్రీనివాస మూర్తి,
అడ్వకేట్, బనగానపల్లె,
నంద్యాల జిల్లా.
సెల్ : 9885040113
(వాది తరుపు న్యాయవాది)

జే డీ ఆర్ కు సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీసు రూలు 242 నోటీసు
మహారాజశ్రీ బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం : 26/2023 in ఓ.యస్.నెం : 70/2019

సిద్దంరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి. ...డి. హెచ్. ఆర్

యెదిరి

తాళంకి ఆది శేషయ్య. ...జె. డీ. ఆర్

డి.హెచ్.ఆర్ :
తాళంకి ఆది శేషయ్య, తండ్రి: రామ చంద్రయ్య
హిందూ, వ్యాపారము, పెండేకంటి నగరు,
బనగానపల్లె టవును మరియు మండలము,
కర్నూలు జిల్లా.

జే డీ ఆర్ కు సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీసు రూలు 242 నోటీసు

పై అమలు అర్జీలో డిక్రీ దారు ఐన సిద్దంరెడ్డి చంద్ర శేఖరెడ్డి నీ బ్యాంకు డిపాజిట్ మొత్తము జప్తి మరియు సెండ్పర్ కోరి పిటిషను దాఖలు చేసినాడు కావున మీరు 11-01-2024 వ తేదీ న ఉదయం 10-30గం. స్వయముగా గాని వకీలు ద్వారగాని ఏదైన ఆక్షేపణలు వుంటే తెలుపుకోగలరు, లేనిపక్షములో దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి వుత్తరువు మేరకు)

వాయిదా తేదీ: 11-01-2024

సి. శ్రీనివాస మూర్తి,
అడ్వకేట్, బనగానపల్లె,
నంద్యాల జిల్లా
సెల్ : 9885040113
(వాది తరుపు న్యాయవాది)